## క్లుప్తంగా

### కేజీబీవీ తనిఖీ



భోజనం తయారీని పరిశీలిస్తున్న ఎంపీడీవో

**భీమారం:** విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం, పౌష్టికాహారం అందించాలని ఎంపీడీవో సత్యనారాయణగౌడ్ పాఠశాల సిబ్బందికి ఆదేశించారు. మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలను ఆయన బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వర్షాకాలం దృష్ట్యా వాటర్ ట్యాంక్‌లను ఎప్పటిప్పుడు శుభ్రం చేయాలని, విద్యార్థులకు స్వచ్ఛమైన నీటిని అందించాలన్నారు. అనంతరం బీసీ కాలనీలోని పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. అసంపూర్తిగా ఉన్న యాదవ సంఘం కమ్యూనిటీ హాల్‌ని పరిశీలించారు. కార్యదర్శి కృష్ణమూర్తితో పాటు కస్తూర్బా పాఠశాల స్పెషల్ ఆఫీసర్ కనకలక్ష్మి ఉన్నారు.

### వసతి గృహాల పరిశీలన



వంటగదిని పరిశీలిస్తున్న ఎంపీడీవో

**లక్సెట్టిపేట:** మున్సిపల్ పరిధిలోని సాంఘిక సంక్షేమ బాలికల కళాశాలను కమిషనర్ రాజశేఖర్, ఎంపీడీవో సరోజ బుధవారం పరిశీలించారు. వసతి గృహంలో విద్యార్థులకు అందించాల్సిన మెనూ ప్రకారం భోజనం ఇస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. వసతి గృహంలో విద్యార్థులకు సౌకర్యాలు, వంటగదిని పరిశీలించి పరిశుభ్రంగా ఉండాలని సూచించారు. మండలంలోని చందారంలో ఎంపీడీవో పర్యటించి వార్డుల్లో తిరిగి చూశారు. పారిశుద్ధ్య సమస్యలు లేకుండా చూడాలని అధికారులకు తెలియజేశారు. ప్రతి ఒక్కరూ పరిశుభ్రతను పాటించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీవో శ్రీనివాస్, కార్యదర్శి శ్రీలత, ఏపీవో వెంకటరమణ పాల్గొన్నారు.

### నూతన ఆలయంలో హోమం

**లక్సెట్టిపేట:** మండలంలోని జెండావెంకటాపూర్ గ్రామ పంచాయతీ పరిధి నాయకపుగూడలో నిర్మించే శ్రీ శివ సాహితీ భక్తాంజనేయ స్వామి ఆలయ నిర్మాణ విగ్రహ ప్రతిష్ఠ పూజలు బుధవారం ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించి హోమం కాల్చారు. మొక్కులు చెల్లించుకున్నారు.

### ముత్తాపూర్‌లో కార్డెన్ సెర్చ్

**భీమిని:** గ్రామాల్లో నేరాల నియంత్రణ కోసం పోలీసుశాఖ ఆధ్వర్యంలో కార్డెన్ సెర్చ్ చేపడుతున్నట్లు తాండూర్ సీఐ కుమారస్వామి తెలిపారు. కన్నెపల్లి మండలంలోని ముత్తాపూర్ గ్రామంలో బుధవారం స్థానిక ఎస్సై గంగారాం పోలీసు సిబ్బందితో కలిసి కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి తనిఖీలు చేశారు. సరైన వాహనపత్రాలు లేని 54ద్విచక్ర వాహనాలను, రెండు ఆటోలను సీజ్ చేశారు. కార్యక్రమంలో పోలీసులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

### పాపన్నగౌడ్ జయంతి

**జన్నారం:** బహుజన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ ఆశయ సాధనకు యువకులు కృషి చేయాలని తహసీల్దార్ రాజమనోహర్ రెడ్డి, ఎస్సై రాజవర్ధన్ పేర్కొన్నారు. సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వారోత్సవాల్లో భాగంగా బుధవారం జన్నారం మండలం కవ్వాల్‌లోని సర్వాయి పాపన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

### నల్లబ్యాడ్జీలతో నిరసన



నిరసన తెలుపుతున్న సంఘ నాయకులు

**జన్నారం:** కులగణన చేయకుండా ఎస్సీ వర్గీకరణ చేయడం వల్ల నేతకానీలకు అన్యాయం జరుగుతుందని, ప్రభుత్వం ఈ విషయంలో పునరాలోచించాలని డిమాండ్ చేస్తూ బుధవారం మండలకేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట నేతకాని సంఘ నాయకులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో నేతకాని సంఘం రాష్ట్ర కమిటీ ఉపాధ్యక్షుడు బోర్లకుంట ప్రభుదాస్, ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి జాడి గంగాధర్, జన్నారం మండల అధ్యక్షుడు రత్నం లక్ష్మణ్, నాయకులు పాల్గొన్నారు.

### స్థల పరిశీలన

**మందమర్రిరూరల్:** మందమర్రి మున్సిపల్ ఆఫీస్ ఆవరణలో మహిళా శక్తి క్యాంటీన్ ఏర్పాటుకు బుధవారం మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, మెప్మా టీఎంసీ రఘురాం స్థల పరిశీలన చేశారు. మహిళల సాధికారత కోసం స్వయం సహాయక సంఘాల ద్వారా ఈ క్యాంటీన్ నడుస్తుందని తెలిపారు. త్వరలోనే పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. వారి వెంట మున్సిపల్ డీఈ సుమతి, అధికారులు ఉన్నారు.

# మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

- చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి

**జైపూర్:** మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని, ఆర్థికంగా పైకి రావడానికి ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుందని చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్‌వెంకటస్వామి తెలిపారు. మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో బుధవారం ఇందిరా మహిళా శక్తి సూక్ష్మరుణాల పంపిణీ కార్యక్రమానికి ఆయన జిల్లా కలెక్టర్ కుమార్‌దీపక్, డీఆర్‌డీవో పీడీ కిషన్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళలను ఉద్దేశించి వారు మాట్లాడారు. నూతన ఆలోచనలతో ముందుకొచ్చే మహిళలకు తగిన విధంగా శిక్షణ ఇచ్చి, వారిని అన్నిరకాలుగా ప్రోత్సాహించాలన్నారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని, అవసరమైతే విశాఖ ట్రస్ట్ తరుపున తమ సహాయ సహకారాలు అందిస్తామన్నారు. అనంతరం కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ... మహిళల జీవన ప్రమాణాలు పెంచడానికి అన్నివిధాలుగా సహకారం అందిస్తామని, అందివచ్చిన అవకాశాలను వినియోగించుకోవాలన్నారు. అదేవిధంగా మంచి వ్యాపార ఆలోచనలతో వచ్చే వారికి బ్యాంకులు, ఇతర సంస్థల నుంచి రుణాలు అందిస్తామన్నారు. ఇందిర మహిళా శక్తి సూక్ష్మరుణ పథకంలో భాగంగా రసూల్‌పల్లిలో ఏర్పాటు చేసిన మొబైల్ ప్లానిటోరియం, జిమ్‌లను ప్రారంభించారు. అనంతరం పలువురికి కల్యాణ లక్ష్మి చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో సత్యనారాయణ, ఎంపీవో బాపు, ఐకేపీ ఏపీఎం రాజ్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధానకార్యదర్శి రిక్కుల శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు విశ్వంభర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

**విద్యుత్ అధికారులపై అసహనం..**

జైపూర్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాలో తరుచూ అంతరాయం ఉంటుందని పలువురు యువకులు ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామికి వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే ఫోన్లో విద్యుత్‌శాఖ అధికారులతో మాట్లాడారు. మండల కేంద్రంలో విద్యుత్ కోతలు ఉన్న విషయం అధికారులకు తెలియకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. తరుచూ విద్యుత్ కోతలు విధించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

**మున్సిపాలిటీలకు రూ.102కోట్లు**

**జైపూర్:** చెన్నూర్ నియోజకవర్గంలో గల మూడు మున్సిపాలిటీల్లో మిషన్ భగీరథ ద్వారా సరిగ్గా మంచి నీళ్లు అందించలేకపోతున్నారని, మిషన్‌భగీరథ పేరుతో గత ప్రభుత్వం డబ్బులు దోచుకుందని జైపూర్ మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే గడ్డం వివేక్‌వెంకటస్వామి తెలిపారు. పైపులైన్లు సరిగ్గాలేవని, ఇక్కడి ప్రాంతంలో కరువు ఉందని కలెక్టర్ ద్వారా కేంద్ర ప్రభుత్వానికి నివేధించినట్లు తెలిపారు. కేంద్రప్రభుత్వం అమృత్ పథకంలో భాగంగా చెన్నూర్‌కు రూ.31, మందమర్రికి రూ.30.50, క్యాతన్‌పల్లి రూ.41.50 కలిసి రూ.102కోట్లు కేటాయించినట్లు తెలిపారు. మిషన్ భగీరథతో సంబంధం లేకుండా ప్రత్యేకంగా నీటి ట్యాంకులు ఏర్పాటు చేసి నీళ్లు అందించేందుకు పనులు త్వరలో ప్రారంభించనున్నట్లు తెలిపారు.

## చికున్ గున్యాను జయించిన శిశువు

- ఉచిత చికిత్స చేసిన మల్లికార్జున పిల్లల ఆస్పత్రి యాజమాన్యం
- హైదరాబాద్‌లో ప్రత్యేక టెస్టు ద్వారా నిర్ధారణ
- వారం రోజుల చికిత్స తర్వాత కోలుకున్న శిశువు



క్షేమంగా బయటపడ్డ చిన్నారితో కుటుంబసభ్యులు

**మంచిర్యాలటౌన్:** జిల్లాలో 30రోజుల శిశువు చికున్ గున్యా జ్వరాన్ని జయించింది. ప్రస్తుతం జిల్లాలో సీజనల్ వ్యాధులు విజంభిస్తున్నాయి. వైరల్ జ్వరాలతో పాటు డెంగీ, చికున్ గున్యా, టైఫాయిడ్ జ్వరాలు ప్రబలుతున్నాయి. జ్వర బాధితులతో ఆస్పత్రులు కిటకిటలాడుతున్నాయి. ఈ క్రమంలో శ్రీరాంపూర్‌కు చెందిన 30రోజుల శిశువుకు పది రోజుల క్రితం జ్వరం రావడంతో తండ్రి బుద్దే సురేందర్ వారం రోజుల క్రితం మంచిర్యాలలోని మల్లికార్జున పిల్లల ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యుడు గోపతి శ్రీనివాస్ వర్మ చిన్నారి చర్మం ఊడిపోవడం గమనించి, వెంటనే ఆస్పత్రిలో అడ్మిట్ చేసుకుని చికిత్స ప్రారంభించాడు. స్థానికంగా 30రోజుల్లో వ్యాధి నిర్ధారించే అవకాశం లేకపోవడంతో, బ్లడ్ శాంపిల్‌ను సేకరించి హైదరాబాద్‌కు పంపించగా చికున్ గున్యా పాజిటివ్ వచ్చింది. చర్మం ఊడిపోతున్నట్లు గుర్తించి స్థానికంగానే ట్రీట్‌మెంట్ చేశారు. మా సెప్టిక్ షాక్ అనే సీవీఆర్ కండిషన్ ద్వారా ఇన్ఫెక్షన్ పాప గుండెకి వ్యాపించింది. పాప కాళ్లు బ్లూ కలర్‌లోకి మారాయి. వెంటనే సెప్టిక్ షాక్‌తో పాటు హార్ట్ ఫంక్షన్‌కి త్వరగా మందులు అందించడంతో నాలుగు రోజుల చికిత్స తర్వాత శిశువు ఆరోగ్యం మెరుగుపడింది. ప్రస్తుతం పూర్తిగా కోలుకుని చికున్‌గున్యాను జయించింది. శిశువు తల్లిదండ్రులు డాక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. చిన్న పిల్లల్లో చికున్ గున్యా అరుదుగా వస్తుందని, దానిని నిర్ధారించే సదుపాయం స్థానికంగా అందుబాటులో లేదని తెలిపారు. అందుకే హైదరాబాద్ ల్యాబ్‌కు పంపించి చికిత్స చేయించామని తెలిపారు. పేద కుటుంబం కావడంతో చికిత్స పూర్తిగా ఉచితంగా అందించామని, శిశువు పూర్తిగా కోలుకుందని పేర్కొన్నారు.

## 'మున్సిపల్ కార్మికులకు క్షమాపణ చెప్పాలి'

**మంచిర్యాలక్రైం:** మున్సిపల్ కార్మికుల పేర్లు రికార్డులో ఎక్కించేందుకు డబ్బులు తీసుకున్న హరికృష్ణ కార్మికులకు క్షమాపణ చెప్పాలని అంబేద్కర్ కాంట్రాక్ట్ కార్మిక సంఘం అధ్యక్షుడు, మున్సిపల్ కౌన్సిలర్ బానేష్ అన్నారు. బుధవారం పాత క్లబ్ సమీపంలో విలేకరులతో మాట్లాడారు. అనంతరం సుదమల్ల అశోక్‌తేజ మాట్లాడుతూ హరికృష్ణ బాధితులు తమను సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

## చెన్నూర్ శివాలయంలో సీసీఎఫ్ ప్రత్యేక పూజలు



సీసీఎఫ్ ప్రభాకర్‌ను సన్మానిస్తున్న అర్చకుడు

**చెన్నూర్‌రూరల్:** కాళేశ్వరం జోన్ అటవీశాఖ సీసీఎఫ్ అధికారి బి.ప్రభాకర్ చెన్నూర్ పట్టణంలోని శివాలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం సీసీఎఫ్‌ను ఆలయ అర్చకులు, అధికారులు సత్కరించారు. కార్యక్రమంలో చెన్నూర్ ఎఫ్‌డీవో సర్వేశ్వర్, డిప్యూటీ రేంజ్ అధికారి ప్రభాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

## మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



బెల్లంపల్లి: మాట్లాడుతున్న సీఐ అఫ్జలుద్దీన్



మందమర్రిరూరల్: అవగాహన కల్పిస్తున్న సీఐ

**బెల్లంపల్లి/జన్నారం/మందమర్రిరూరల్/భీమారం/వేమనపల్లి/శ్రీరాంపూర్/భీమిని/కాసిపేట/కోటపల్లి:** మత్తుపదార్థాలు జీవితాన్ని నాశనం చేస్తాయని, విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని పోలీసులు సూచించారు. యాంటీ నార్కోటిక్ అవర్‌నెస్ డేను పురస్కరించుకుని బుధవారం ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలల్లో, కళాశాలల్లో డ్రగ్స్‌పై అవగాహన కల్పించారు. విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. మత్తు పదార్థాల వల్ల మానసిక స్థితి మందగిస్తుందని, తద్వారా ఆలోచన శక్తి పడిపోతుందని సూచించారు. విద్యార్థి, యువకులు గంజాయి, గుట్కా ఇతర రకాల మత్తు పదార్థాలకు దూరంగా ఉండి ఉజ్వల భవిష్యత్ వైపు అడుగులు వేయాలన్నారు. పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి, ఎస్సై రాజశేఖర్, బెల్లంపల్లి రూరల్ సీఐ అఫ్జలుద్దీన్, టూటౌన్ ఎస్సై కే.మహేందర్, జన్నారం ఎస్సై రాజవర్ధన్, భీమారం ఎస్సై రాములు, ఏఎస్సై భూమన్న,హెడ్‌కానిస్టేబుల్ పున్నం, వేమనపల్లి ఎస్సై శ్యాంపటేల్, శ్రీరాంపూర్ ఎస్సై సంతోష్, తాళ్ల గురిజాల ఎస్సై రమేష్, భీమిని ఎస్సై విజయ్‌కుమార్, కాసిపేట ఎస్సై ప్రవీణ్‌కుమార్, ఏఎస్సై రాజన్న, దేవాపూర్ ఎస్సై ఆంజనేయులు, కోటపల్లి ఎస్సై రాజేందర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## సంక్షిప్త వార్తలు

**రెండు కేసులు నమోదు**

**మంచిర్యాలక్రైం:** బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిపై పోలీస్‌శాఖ స్పెషల్ ఫోకస్ పెట్టిందని స్థానిక సీఐ బన్సీలాల్ తెలిపారు. జిల్లా కేంద్రంలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే ప్రాంతాలను గుర్తించి రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాసులు ఆదేశాల మేరకు మంగళవారం రాత్రి తనిఖీలు చేశారు. తనిఖీల్లో కాలేజీరోడ్, మాత శిశు కేంద్రం పరిసర ప్రాంతాల్లో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిన వారిపై రెండు కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. అనంతరం మాతాశిశు కేంద్రంలో తనిఖీ చేయగా ఐదుగురు వ్యక్తులు మద్యం సేవించిన వారిని గుర్తించి భయటకు పంపినట్లు పేర్కొన్నారు.

**కార్మికులను విడుదల చేయాలి**

**మంచిర్యాలక్రైం:** రాష్ట్ర విద్యా కమిషనర్ కార్యాలయం ఎదుట ధర్నా చేసిన మధ్యాహ్న భోజనం కార్మికులను అరెస్ట్ చేయడాన్ని సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ ఖండించారు. అరెస్ట్ చేసిన వారిని విడుదల చేయాలని ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

**'ఆరోపణలు మానుకోవాలి'**

**మంచిర్యాలరూరల్(హాజీపూర్):** నాలుగు వరసల జాతీయ రహదారి విస్తరణలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్‌పై అధికార పార్టీ నేతలు రైతులతో కలిసి తప్పుడు ప్రచారం చేస్తున్నారని బీజేపీ నాయకులు మండిపడ్డారు. మండల కేంద్రంలో బుధవారం మాట్లాడారు. రఘునాథ్‌కు వ్యతిరేకంగా తప్పుడు ప్రకటనలు చేస్తున్నవారు క్షమాపణలు చెప్పాలని, లేనిపక్షంలో సహించమని హెచ్చరించారు.

**కళాజాత ప్రదర్శన**

**దండేపల్లి:** మండలంలోని మేదరిపేటలో సంస్కృతి, సారథి కళాకారులు ప్రభుత్వ పథకాలపై బుధవారం కళాజాత ప్రదర్శన నిర్వహించారు.

**నర్సింగ్ కళాశాలపై చర్యలు తీసుకోవాలి**

**మంచిర్యాలఅగ్రికల్చర్:** ఎస్ఆర్‌కేఎం నర్సింగ్ కళాశాలపై చర్యలు తీసుకోవాలని ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ ఏవోకు వినతిప్రతం అందజేశారు. నిబంధనలకు విరుద్ధంగా కళాశాల నడిపిస్తున్నట్లు ఆరోపించారు.

**ఘనంగా ప్రపంచ వృద్ధుల దినోత్సవం**

**మంచిర్యాలక్రైం:** ప్రపంచ వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం జిల్లా కేంద్రంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో వృద్ధులతో కేక్ కట్ చేయించారు. పండ్లు పంపిణీ చేశారు.

**శివుని విగ్రహ ప్రతిష్ఠాపన**

**లక్సెట్టిపేట:** మండల కేంద్రంలోని పుస్కూరి సత్యనారాయణరావు మెమోరియల్ ట్రస్టు సహకారంతో శ్మశానవాటికలో శ్రీ శివసాయి గణేష్ సేవా సమితి ఆధ్వర్యంలో శివుని విగ్రహాన్ని ప్రతిష్ఠించారు.

**వైద్య శిబిరాలు**

**మందమర్రిరూరల్/భీమిని/మంచిర్యాలరూరల్ (హాజీపూర్):** మందమర్రి పట్టణంలోని సీఈఆర్ క్లబ్‌లో ఆటో యూనియన్, ఆటో కార్మిక సేవా సమితి ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ సహకారంతో బుధవారం కంటి వైద్య చికిత్స శిబిరం నిర్వహించారు. భీమిని మండలంలోని ఖర్జీభీంపూర్‌లో పీహెచ్‌సీ వైద్యుడు కుమారస్వామి 36మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ముల్కల్లలో లయన్స్ క్లబ్ మంచిర్యాల, లయన్స్ క్లబ్ గోల్డెన్ జూబ్లీ సంయుక్త ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం నిర్వహించారు.

## వినూత్న ఆలోచనలకు జిజ్ఞాస ప్రయోగాలే కీలకం



ప్రయోగాలను వివరిస్తున్న ఉపాధ్యాయులు

**తాండూర్:** విద్యార్థుల్లో వినూత్న ఆలోచనలు పెంపొందించేందుకు జిజ్ఞాస ప్రయోగాలు ఎంతో కీలకమని జిల్లా స్థాయి జిజ్ఞాస సంచార ప్రయోగశాల నిర్వాహకులు సాయికుమార్, సంపత్ అన్నారు. జిల్లా సైన్స్ కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలోని మాదారం ఇంక్‌లైన్ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు శాస్త్రీయ విజ్ఞానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మానవ శరీరంలో అంతర్గత అవయవాలపై, స్వయంగా ప్రయోగ పరికరాల ద్వారా ప్రయోగ నైపుణ్యాలను ఎలా పెంపొందించుకోవాలో వివరించారు. అయస్కాంతం యొక్క ఆకర్షణ, లిట్మస్ పేపర్స్, సోలార్ వ్యవస్థ, పెరిస్కోప్ యొక్క ఉపయోగాలను విద్యార్థులకు ప్రయోగపూర్వకంగా వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు విద్యాసాగర్, ఉపాధ్యాయులు శేఖర్, రఘుపతి పాల్గొన్నారు.

## బంద్ సంపూర్ణం



కలమడుగులో పాఠశాలను బంద్ చేయిస్తున్న నాయకులు

**జన్నారం/లక్సెట్టిపేట:** ఎస్సీవర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పునకు నిరసనగా ఇచ్చిన భారత్‌బంద్‌లో భాగంగా జన్నారం, లక్సెట్టిపేట మండలాల్లో మాల మహానాడు ఆధ్వర్యంలో నిర్వహించిన బంద్ విజయవంతం అయింది. ఒకరోజు ముందుగానే మాలమహానాడు సభ్యులు ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలలకు, దుఖాణ సముదాయలకు సమాచారం ఇవ్వడంతో స్వచ్ఛందంగా బంద్ పాటించారు. ఎస్సీ వర్గీకరణ విషయంలో సుప్రీంకోర్టు తీర్పుతో మాల, ఉపకులాలు నష్టపోతున్నట్లు పేర్కొన్నారు. తీర్పును సవరించాలని కోరారు. ప్రధాన రహదారిపై ర్యాలీ తీశారు. కార్యక్రమంలో జన్నారంలో మాలమహానాడు మండల అధ్యక్షుడు పాత బాలరాజు, జిల్లా, మండల నాయకులు బెంజిమెన్, జక్కుల సురేశ్, భరత్‌కుమార్, బండ దేవేందర్, కరుణాకర్, లింగయ్య, సంజీవ్, వెంకటేశ్, నర్సయ్య, రాజన్న, లక్సెట్టిపేటలో గరిసె రవీందర్, దమ్మ నారాయణ, పురుషోత్తం, మల్లేష్, చిన్నయ్య, లింగన్న, రాజు, నరేష్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## 'ఏబీసీడీ వర్గీకరణ రాజ్యాంగానికి వ్యతిరేకం'



దండేపల్లి: నిరసన తెలుపుతున్న నాయకులు

**బెల్లంపల్లి:** ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ వ్యతిరేకమని ఎస్సీ వర్గీకరణ పోరాట సమితి జిల్లా నాయకులు అన్నారు. ఏబీసీడీ వర్గీకరణకు వ్యతిరేకంగా బుధవారం బెల్లంపల్లిలో నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. పట్టణంలోని పలు పాఠశాలలు బంద్ చేయించి పురవీధుల్లో శాంతియుత ర్యాలీ చేశారు. కాంటా చౌరస్తా వద్ద రోడ్డుపై బైఠాయించి వర్గీకరణకు వ్యతిరేకంగా నినదించారు. కార్యక్రమంలో నాయకులు కాసర్ల యాదగిరి, కుంబాల రాజేష్, సబ్బని రాజనర్సు, దాసరి ప్రతాప్, పైడిమల్ల చంద్రశేఖర్, పట్నం చక్రధర్, ఆసాది మధు, సోత్కు శ్రీనివాస్, మద్దెల గోపి, మురళి పాల్గొన్నారు.

**మాల మహానాడు నిరసన**

**దండేపల్లి:** ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా దండేపల్లి మండల కేంద్రంలో మాల మహానాడు ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. అనంతరం తహసీల్దార్ సంధ్యారాణికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు పాల్గొన్నారు.

## 'కేసు నమోదు చేయాలి'

**మందమర్రిరూరల్:** గోదావరిఖనిలో స్వప్న అనే సింగరేణి కార్మికురాలిపై దాడికి పాల్పడిన వారిపై వెంటనే కేసు నమోదు చేసి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని హెచ్ఎమ్మెస్ మందమర్రి ఏరియా ఉపాధ్యక్షుడు జే శ్రీనివాస్ డిమాండ్ చేశారు. హెచ్ఎమ్మెస్ ఆఫీస్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజిరెడ్డి, సుదర్శన్, శ్రీనివాసరెడ్డి, ముఖేష్, థామస్, ప్రదీప్ ఉన్నారు.

## 23న మండల ప్రజావేదిక

**వేమనపల్లి:** 23వ తేదీ శుక్రవారం జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధ్యక్షతన ఉపాధిహామీ సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి, ఏపీవో సత్యప్రసాద్ తెలిపారు. 2023–24 మండలంలో ఉపాధిహామీ పథకం కింద రూ.2కోట్ల 50లక్షలతో చేపట్టిన పనులకు సోషల్ ఆడిట్ బృందాలు తనిఖీలు నిర్వహిస్తారన్నారు.

## నియామకం

**చెన్నూర్/మంచిర్యాలక్రైం:** బీజేవైఎం తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా అమిరిశెట్టి రాజ్‌కుమార్, చెన్నూర్ పట్టణానికి చెందిన ఏతం శివకృష్ణలను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్ ఉత్తర్వులు జారీ చేశారు. బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా నియమించేందుకు సహకరించిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

## ఎస్ఎస్ఎఫ్ చెక్కు అందజేత

**శ్రీరాంపూర్:** ఎస్ఆర్పీ 3గనిలో పనిచేస్తూ అనారోగ్య కారణాలతో మృతి చెందిన కాదాసీ దుర్గాప్రసాద్ అనే కార్మికుల కుటుంబానికి కంపెనీ సోషల్ సెక్యూరిటీ ఫండ్ (ఎస్ఎస్ఎఫ్) మొత్తాలను అందించింది. గనిపై బుధవారం జరిగిన కార్యక్రమంలో గని మేనేజర్ వెంకట్రావు చేతుల మీదుగా కుటుంబ సభ్యులకు ఈ మొత్తం రూ.62250 చెక్కు రూపంలో అందించారు.

## బొగ్గుబాయి వార్తలు

### పచ్చదనం పెంపొందించాలి



మొక్క నాటుతున్న ఇన్‌చార్జి జీఎం శ్రీనివాస్

**శ్రీరాంపూర్:** పచ్చదనాన్ని పెంచాలని, అప్పుడే మానవాళి మనుగడ సాధిస్తుందని శ్రీరాంపూర్ ఏరియా ఇన్‌చార్జి జీఎం టీ శ్రీనివాస్ తెలిపారు. వనమహోత్సవంలో భాగంగా బుధవారం శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ గనిలో 6 వేల మొక్కలను నాటారు. ఈ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తమ పుట్టిన రోజు, పెళ్లిరోజున నివాసాల వద్ద కనీసం రెండు మొక్కలు నాటడం అలవాటు చేసుకోవాలన్నారు. నాటిన మొక్కలను సంరక్షించడం ఎంతో ముఖ్యమన్నారు. కార్యక్రమంలో గుర్తింపు సంఘం ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి ఎస్కే బాజీసైదా, అధికారుల సంఘం ఏరియా అధ్యక్షుడు వెంకటేశ్వర్ రెడ్డి, ఎస్‌ఓటుజీఎం సత్యనారాయణ, ఏజీఎం ఫైనాన్స్ మురళీధర్, డీజీఎంలు అరవిందరావు, చిరంజీవులు, ఆనంద్ కుమార్, రవీందర్, ఏరియా ఇంజనీర్ చంద్రశేఖర్ రెడ్డి, ఫారెస్ట్ మేనేజర్ చంద్రమణి, డిప్యూటీ చీఫ్ మెడికల్ ఆఫీసర్ రమేష్ బాబు, ఏరియా సర్వే అధికారి వెంకటేశం, గని మేనేజర్ బ్రహ్మాజీ, ఫిట్ సెక్రటరీ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

## కార్మికులపై వేధింపులు మానుకోవాలి



మాట్లాడుతున్న సారయ్య

**శ్రీరాంపూర్:** గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నాయకులు కార్మికులపై వేధింపులు మానుకోవాలని హెచ్ఎమ్మెస్ శ్రీరాంపూర్ బ్రాంచీ ఉపాధ్యక్షుడు తిప్పారపు సారయ్య సూచించారు. శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం వద్ద బుధవారం ఆయా గనుల కార్మికులతో కలిసి మాట్లాడారు. ఎన్నికలు జరిగినప్పటి నుంచి గెలిచిన ఏఐటీయూసీ యూనియన్ నాయకులు కార్మికులపై వేధింపులు రాజకీయ కక్ష సాధింపులకు పాల్పడుతుందన్నారు. రెగ్యులర్‌గా యాక్టింగ్ చేసిన వారికి ప్రమోషన్లు రాకుండా యాక్టింగ్‌లు తీసేసి వారికి అనుకూలమైన వారికి ప్రమోషన్ ఇప్పించేలా చేస్తున్నారన్నారు. గనులపై ప్లేడేలు కూడా వారికి అనుకూలంగా ఉన్న వారికే ఇప్పించుకుంటున్నారన్నారు. వారి దుశ్చర్యలకు అధికారులు కూడా మద్దతు పలుకుతున్నారన్నారు. దీంతో కార్మికులు తీవ్ర అన్యాయమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉచిత మస్టర్లు పొందడం, గిట్టని వారిని షిఫ్ట్ మార్పిడి చేయడం, ట్రాన్స్‌ఫర్లు చేయడం చేస్తూ కార్మికులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. ఈ విధానం మానుకోవాలన్నారు. అధికారులు కూడా ఆ యూనియన్ నాయకులకు ఏకపక్షంగా వత్తాసు పలికితే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆ యూనియన్ ఏరియా కార్యదర్శి అనిల్‌రెడ్డి, నాయకులు కొమురయ్య, సురేశ్, శ్రీనివాస్, వంశీ, నదీం పాల్గొన్నారు.

## 14మందికి కారుణ్య నియామకపత్రాల అందజేత



ఉద్యోగాలు పొందిన వారితో ఏరియా జీఎం

**మందమర్రిరూరల్:** మందమర్రి ఏరియాలోని 14మందికి ఏరియా జీఎం దేవేందర్ ఆఫీస్ ఆవరణలో బుధవారం కారుణ్య నియామకపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నూతనంగా ఉద్యోగంలో చేరే వారు గైర్హాజరు లేకుండా, ఏరియాకు సంస్థ నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తికి సహకరించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌వోటు జీఎం రాజేశ్వర్‌రెడ్డి, పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, అధికారులు, యూనియన్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

## మత్స్య పారిశ్రామిక సంఘం చైర్మన్ ఎన్నిక

**మంచిర్యాలఅగ్రికల్చర్:** మత్స్య పారిశ్రామిక సహకార సంఘం చైర్మన్‌గా గంపల చిన్నయ్య ఎన్నికయ్యారు. బుధవారం కలెక్టరేట్‌లో సహకార సంఘం కార్యాలయంలో గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ గంగపుత్ర సంఘాల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. గంగపుత్ర సంఘం పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్, వేణుగోపాల్, ప్రభాకర్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

## హైవేపై ప్రమాదాలు అరికట్టాలి

**రామకృష్ణాపూర్:** మంచిర్యాల–నాగ్‌పూర్ హైవే మార్గంలోని బొక్కలగుట్ట వద్ద ప్రమాదాలను నివారించేందుకు నేషనల్ హైవే అథారిటీ అధికారులు చర్యలు తీసుకోవాలని మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి సూచించారు. మంచిర్యాల ఆర్టీవో ఖాసీంతో కలిసి ఇటీవల రోడ్డు ప్రమాదం జరిగిన స్థలాన్ని బుధవారం పరిశీలించారు. విద్యుత్ దీపాలు, సూచికబోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు.